పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలి

సెక్టోరల్ అధికారుల శిక్షణా తరగతుల్లో రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

షాబాద్, మే 11 : ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. శనివారం స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా కలెక్టర్ క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఇదివరకు కూడా ఇవే బాధ్యతలను నిర్వర్తించాం కదా అనే భావనతో విధులను ఎంత మాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఎవరైనా విధుల పట్ల ఆలస్యాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి సమాచారం అందించాలన్నారు. పక్కాగా నిబంధనలను పాటించాలన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందే ఉదయం ఆరు గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని, పోలింగ్ బృందంలోని అధికారులు, సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా అన్నది చూసుకోవాలని, పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన సామగ్రిని సక్రమంగా అందించారా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. అదనపు పోలింగ్ సామగ్రిని తమ వద్ద అందుబాటులో ఉండేలా సెక్టోరల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవడం, చెక్ చేయడం వంటివి చేయకూడదన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ ప్రారంభమయ్యేలా చూడాలని, ఏజెంట్లు రాకపోతే 15 నిమిషాలు వేచి చూసి మాక్ పోల్ జరిపించాలని సూచించారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, సెక్టోరల్ అధికారులు వెంటనే స్పందించి తమ వద్ద రిజర్వ్‌లో ఉంచిన యూనిట్లను సమకూర్చాలని సూచించారు. యూనిట్లు మార్చడానికి ముందు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాన్ని సంప్రదించి వారికి సమస్యను వివరించాలని తెలిపారు.

పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెంటవెంట ఎన్ కోర్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. 17-సి డాక్యుమెంట్, పీ.ఓ డైరీ, విజిట్ ఇట్, మాక్ పోల్ సర్టిఫికెట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పులు లేకుండా సక్రమంగా పూరించేలా పరిశీలన జరపాలన్నారు. పోలింగ్ ముగిసిన మీదట ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలని, వాటిని సరి చూసుకుని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులు అక్కడే అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. సెక్టోరల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందుగానే క్షేత్రస్థాయిలో సందర్శించి, మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలో టెంట్లు సరిపడా వేశారా లేదా అన్నది గమనించాలన్నారు. తాగునీరు, టాయిలెట్, విద్యుత్ వసతి, ఫ్యాన్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, ఇతర ఫర్నిచర్ సమకూర్చుకున్నారా అన్నది పరిశీలించాలని, ర్యాంపు సరిగా ఉండేలా, వీల్ చైర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా అన్నది గమనించాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణా తరగతుల్లో కందుకూరు ఆర్డీవో, సహాయ రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్, సంబంధిత అధికారులున్నారు.

మూడో విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పి.ఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం కలెక్టర్ శశాంక పరిశీలకుల దృష్టికి తెచ్చారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 3459 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 3796 టీములను పోలింగ్ విధుల కోసం నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజెషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో డీఆర్ఓ సంగీత, ఎన్ఐసీ అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులున్నారు.

శిక్షణా తరగతులకు హాజరైన సెక్టోరల్ అధికారులు

సమస్యలు లేకుండా ఎన్నికలు నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

వికారాబాద్, మే 11 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. శనివారం వికారాబాద్‌లోని మేరీనాట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగే ముందు ఈవీఎంల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 12న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సెక్టార్లవారీగా సంబంధించిన పోలింగ్‌స్టేషన్‌లకు ఈవీఎంలను జాబితా ప్రకారం అందజేయాలని తెలిపారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌కు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మైక్‌లు, కూలర్స్, తాగునీరు, పోలింగ్ అధికారులకు కావాల్సిన భోజనాలు, టీ సౌకర్యాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ రమణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేశ్ రంజన్


బొంగ్లూర్ చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకుడు

ఇబ్రహీంపట్నం, మే 11 : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలని, ఖర్చు చేసిన లెక్కలను ప్రతిరోజూ అధికారులకు అందజేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేశ్ రంజన్ అన్నారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నంలోని ఔటర్‌రింగ్‌రోడ్డు వద్ద ఉన్న చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. అనంతరం శేరిగూడ, ఉప్పరిగూడ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించే వసతులపై కూడా ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలకు లోబడి అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుందని అన్నారు. అలాగే, ఖర్చు చేసిన ప్రతి రూపాయి కూడా ఏరోజుకారోజు అధికారులకు లెక్కలు చూపించాలన్నారు. ఈ నెల 13న పోలింగ్ కేంద్రాలకొచ్చే ఓటర్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు కచ్చితంగా అందుబాటులో ఉంచాలని, వైద్య బృందాలను కూడా పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచాలని ఆయన సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలకొచ్చే ఓటర్లను ఎండ తీవ్రత నుంచి కాపాడటం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఎంపీవో లక్ష్మితినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరిలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 11 : భువనగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఇబ్రహీంపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లకు బ్రహ్మరథం పట్టారన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా సరిగ్గా అమలు చేయకపోవడం వలన ప్రజలు ఆ పార్టీపై గుర్రుగా ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించి తప్పు చేశామని, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపిస్తామని అన్ని వర్గాల ప్రజలు ముందుకొచ్చి చెబుతున్నారని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకే మెజార్టీ వస్తుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

గాంధీ భవన్, గద్వాల బంగ్లా రాజకీయాలు మనకొద్దు

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దూదిమెట్ల బాల్‌రాజ్, రాష్ట్ర నాయకుడు రాజావరప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న దూదిమెట్ల బాల్‌రాజ్, రాజావరప్రసాద్

షాద్‌నగర్, మే 11 : పాలమూరు ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్, సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21 రోజుల పాటు వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించామని, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన, మద్దతు వచ్చిందని చెప్పారు. మరోమారు బీఆర్ఎస్ జెండా పాలమూరు గడ్డపై ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సీమాంధ్రుల బాగు కోసం మన నదీ జలాలు సీమాంధ్రుకు పోతుంటే హారతులు పట్టిన బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మన ఓటు అడిగే అర్హత లేదని, విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లను రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీని నమ్మొద్దని సూచించారు. ఏనాడు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి ఏ నినాదంతో ఓట్లు అడుగుతున్నారో చెప్పాలని.. పాలమూరు ప్రజల పక్షాన పనిచేయని వంశీచందర్‌రెడ్డికి పాలమూరు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. గాంధీభవన్, గద్వాల బంగ్లా రాజకీయాలు పాలమూరు ప్రజలకు అవసరం లేదని, ప్రజా సంక్షేమాన్ని అందించే పార్టీ, ప్రజల పక్షాన, మన ఆత్మ గౌరవం కోసం పని చేసే నాయకుడిని మనం ఎన్నుకోవాలన్నారు. కేవలం బీజేపీని గెలిపించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి నామమాత్రం ప్రచారాలను చేస్తున్నారని, ఇందుకు నిదర్శనం శుక్రవారం మక్తల్‌లో జరిగిన కాంగ్రెస్ సభ అని అన్నారు. ప్రచార మార్గమధ్యంలో డీకే భరతసింహారెడ్డిని సీఎం ఎందుకు కలిశారని? లీకులు, బ్రేకింగ్‌లు, షాకింగ్‌లు, మూటలు గోయింగ్‌లు అనే చందంగా సీఎం వ్యవహరిస్తున్నారని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి బీజేపీని గెలిపించే పనిలో ఉన్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ప్రతాప్‌రెడ్డి, పర్ణికారెడ్డిలతో పాటు మరికొంతమంది నేతలు బీజేపీ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలను మోసం చేయడం కొత్త కాదని, వచ్చే నెల 2 నుంచి హైదరాబాద్ మహా నగరం ఉమ్మడి రాజధానిగా ఉండదనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని, కాంగ్రెస్, బీజేపీలు హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని వాపోయారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారని, మరో రెండు రోజుల పాటు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని వారు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

ప్రతి ఓటు కీలకమే..

కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 11: ప్రతి ఓటు ఎంతో కీలకమని పోలింగ్ రోజున బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈఆర్డీ గార్డెన్‌లో శనివారం మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల పరిధికి చెందిన బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. పోలింగ్ రోజున తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆయన బూత్ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముగిసే వరకు ఏజెంట్లు బూత్‌లలోనే ఉండాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు విఠల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వివిధ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు మల్లారెడ్డి, శ్రీధర్‌గౌడ్, రవికుమార్, అరవింద్‌రెడ్డి, నాయకులు రఘువీర్‌రెడ్డి, మల్లీశ్వరి, అంజలి, నాగరాజు, జగదీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

రాగిడికి మద్దతుగా ప్రచారం

మల్కాజిగిరి పార్లమెంటు స్థానాన్ని భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలువనున్నట్లు నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పాటి చిరంజీవి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికుట్రలు చేసిన బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేవన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌గౌడ్, రవి, శ్యాసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు..

సిటీబ్యూరో, మే 11, (నమస్తే తెలంగాణ) : ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే ఓటరు స్లిప్పులను పంపిణీ చేసింది. అయితే వివిధ కారణాల వల్ల కొంతమందికి ఇవి అందకపోయి ఉండవచ్చు. అయితే స్లిప్ లేనంత మాత్రాన ఓటింగ్‌కు దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. మొబైల్ ద్వారా మీరు మీ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను చూసుకోవచ్చు. మీ వద్ద ఓటరు కార్డు ఉంటే ఆ నంబర్‌ను 1950, 9211728082 నంబర్లకు పంపిస్తే.. మీ పోలింగ్ కేంద్రం వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో మీకు లభిస్తాయి. 24 గంటల పాటు పని చేసే టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఫోన్ చేసి కూడా వివరాలు తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపు కార్డు నంబర్ సాయంతో పోలింగ్ కేంద్రం, బూత్ నంబర్, క్రమ సంఖ్య వంటి వివరాలు తెలుసుకోవచ్చు.

హెల్ప్ లైన్ యాప్..

ఎన్నికల సంఘానికి చెందిన ఓటర్ హెల్ప్ లైన్, యాప్ డౌన్ లోడ్ చేసుకొని కూడా వివరాలు పొందవచ్చు. https://www.ceotelangana.nic.in/అనే వెబ్ సైట్‌లో Search Your Name in Voter List ఆప్షన్‌పై క్లిక్ చేసి.. ఓటరు గుర్తింపు కార్డు లేదా మొబైల్ నంబర్ లేదా పేరును ఇవ్వడం ద్వారా ఏ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చో తెలుసుకోవడంతో పాటు డిజిటల్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కాసానితోనే బీసీలకు సముచిత న్యాయం

బీసీలపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలను నమ్మేది లేదు

జ్ఞానేశ్వర్‌కే తమ మద్దతు అంటున్న బీసీ నేతలు

కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే బీసీలు అధోగతిపాలవ్వడం ఖాయమని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మారడం తప్పితే.. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు తమ అహంకారపూరిత మాటలతో బీసీల ఐక్యతను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేతలకు వత్తాసు పలికితే రాబోయే రోజుల్లో బీసీ వర్గాలకు ఎదురయ్యే పరిస్థితులు ఇప్పుడే కండ్ల ముందర కదలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీల ఐక్యతకు కృషి చేస్తున్న బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు బీసీలంతా మద్దతుగా నిలిచి గెలిపించుకుంటే బీసీలోని అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు.

- రంగారెడ్డి, మే 11 (నమస్తే తెలంగాణ)

కాసాని గెలిస్తేనే బీసీలకు న్యాయం

పార్లమెంట్ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్ గెలిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. గతంలో గెలిచిన ఇద్దరు ఎంపీలు బీసీలను అస్సలు పట్టించుకోలేదు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసి, అనేక పథకాలు అమలు చేశారు.

– ఈదుల సుధాకర్‌గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు, షాబాద్

ముదిరాజ్ బిడ్డను గెలిపించుకుందాం

ఎంపీ ఎన్నికల్లో ముదిరాజ్ బిడ్డ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం పాటుపడే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించుకుందాం. ఉమ్మడి రాష్ట్రంలోని 96 కులాలను ఏకం చేసి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా రంగారెడ్డి జిల్లాలో ఆయనకు మంచి పట్టుంది.

– భూపతి రాజేందర్‌ముదిరాజ్, ముద్దెంగూడ(షాబాద్)

కాసానిని గెలిపించుకుంటాం

బీసీలపై నమ్మకంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దించారు. బీసీలమంతా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించి ఢిల్లీకి పంపిస్తాం. ప్రతి బీసీ బిడ్డ ఆలోచించి ఓటు వేసి, కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడతాం. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు.

– రవీందర్‌సింగ్ తన్వర్, బషీరాబాద్

జ్ఞానేశ్వర్ గెలుపు.. కాంగ్రెస్, బీజేపీలకు కనువిప్పు

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో.. కాంగ్రెస్, బీజేపీలకు కనువిప్పు కావాలి. బీసీలను చిన్నచూపు చూసే కాంగ్రెస్, బీజేపీలను ఓడించే సరైన సమయం వచ్చిందని బీసీ బిడ్డలు ముక్తకంఠంతో చెబుతున్నాయి. బలహీనవర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే పార్టీ ఒక్క బీఆర్ఎస్సేనని.. ప్రతి బీసీ బిడ్డ గుర్తుంచుకోవాలి.

– తాహెర్, బీఆర్ఎస్ మైనార్టీ యువజన నాయకుడు

జ్ఞానేశ్వర్‌ను గెలుపించుకుంటాం

చేవెళ్ల లోక్‌సభ బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. గతంలో అగ్ర వర్గాల నాయకులను నమ్మి మోసపోయాం. మన బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మార్చుకున్నారు తప్ప బీసీలకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు.

– నర్సింహులు, మున్నూరుసోమారం, ధారూరు మండలం

బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను బీసీలు ఏకమై అఖండ మెజార్టీతో గెలిపించుకొని బీసీల ఐక్యతను ఢిల్లీలో చాటిచెప్పాలి. అన్ని రాజకీయ పార్టీల బీసీ నేతలు ఈసారి కాసానిని గెలిపించుకునేందుకు రాజకీయాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. గతంలో అన్ని రాజకీయ పార్టీలు మన ఓట్లను రాజకీయంగా వాడుకునేవారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం.

– వీరన్న, మోమిన్‌కలాన్, ధారూరు మండలం

ఓటుతో సత్తా చాటుదాం

చేవెళ్ల బీఆర్ఎస్ బీసీ అభ్యర్థి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకునే విషయంలో వెనుకబడిన వర్గాలన్నీ పార్టీలకతీతంగా కలిసి రావాలి. ఓటు ద్వారా బీసీల బలం ఏమిటో హేళనగా మాట్లాడే పార్టీలకు నిరూపిద్దాం. ఏండ్ల తరబడి ఓటు బ్యాంకుగా రాజకీయ